ప్రజాశక్తి

శుక్రవారం 12 జనవరి 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



విజయవాడ ధర్నా చౌక్ వద్ద సభలో మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న నేతలు

నేటి నుంచి విధుల్లోకి మున్సిపల్ కార్మికులు

నేతల అభినందనలు

ప్రజాశక్తి - విజయవాడ : మున్సిపల్ కార్మికులు శుక్రవారం నుండి విధుల్లో చేరనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించిన నేపథ్యంలో గురువారం ధర్నా చౌక్‌లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్ అధ్యక్షతన సభను నిర్వహించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల సారాంశాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కార్మికులకు వివరించారు. ప్రభుత్వం ఎన్ని వత్తిడిలు తెచ్చినా తమ సమస్యల పరిష్కారం కోసం 16 రోజులపాటు ఐక్యంగా పోరాడిన వేలాది మంది మున్సిపల్ కార్మికులను ఉమామహేశ్వరరావుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.తిరుపతమ్మ, టి.మార్తమ్మ, గార్లపాటి లక్ష్మీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.


నేడు 'మోడీ, షా హఠావో - దేశ్ బచావో' సభ

హాజరుకానున్న ప్రముఖ నేతలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : "మోడీ, షా హఠావో - దేశ్ బచావో" నినాదంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు భారీ సభ నిర్వహించనున్నట్లు భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఎపి కమిటీ కన్వీనర్లు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ జాతీయ నాయకులు అజీజ్ పాషా, కాంగ్రెస్ జాతీయ నాయకులు జెడి.శీలం, సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ హేమలత, ఎఐటియుసి జాతీయ నాయకులు వహిదా నిజాం, ఎస్‌కెఎం జాతీయ నాయకులు రాకేష్ తికాయత్, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు, హీరో ఆర్.నారాయణ మూర్తి, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజతోపాటు ఇంకా పలువురు రాజకీయ, కార్మిక, రైతు, మహిళ, యువజన, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. కలిసి వచ్చే శక్తులు, సంస్థలు, పార్టీలు, సంఘాలు, మేధావులతో నిర్వహించే ఈ సభను విజయవంతం చేయాలని శోభనాద్రీశ్వరరావు, (మిగతా 6లో)

వైసిపిలో భారీ మార్పులు

- సారథి అవుట్
- విజయవాడ ఎంపికి కేశినేని నాని
- మంత్రి జోగికి స్థాన చలనం
- పెడనకు ఉప్పాల రాము



ప్రజాశక్తి - కష్ణా, విజయవాడ ప్రతినిధులు

వైసిపి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్చార్జుల మూడో జాబితాను గురువారం వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. దీనిలో భాగంగా విజయవాడ ఎంపి, కృష్ణాజిల్లా పెడన, పెనమలూరు అసెంబ్లీ నియజకవర్గాలకు ఇన్చార్జులుగా నియమితులైన వారి పేర్లను వెల్లడించారు. దీంతో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 5 నియోజకవర్గాలకు ఇప్పటి వరకు ఇన్చార్జులను నియమించినట్లయింది. ఫలితంగా ముగ్గురు సిట్టింగ్ ఎంఎల్‌ఎలు టికెట్లు కోల్పోయారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇచ్చార్జి స్థానాన్ని ఇటీవలే టిడిపిని వీడి వైసిపిలో చేరిన కేశినేని శ్రీనివాస్ (నాని)కు కేటాయించారు. అలాగే కృష్ణాజిల్లా పెడన, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా కొత్త ఇన్చార్జులను నియమించారు. కృష్ణాజిల్లా పెడన ఇచ్చార్జిగా జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త, వైసిపి నాయకులు ఉప్పాల రాము నియమితులయ్యారు. రాము తండ్రి ఉప్పాల రాంప్రసాద్ 2104, 2019 ఎన్నికల్లో చివరి క్షణంలో పెడన టికెట్‌ను త్యాగం చేయాల్సి వచ్చింది. రెండుసార్లు టికెట్ నిరాకరించినా పార్టీని నమ్ముకుని, పార్టీ విజయం కోసం రాంప్రసాద్ కుటుంబం పని చేసింది. పెడన నుంచి పోటీకి సిద్ధంగా ఉండాలని ఏడాది క్రితమే రాముకు పార్టీ పెద్దలు సూచిస్తూ వచ్చారు. మంత్రి జోగి రమేష్‌కు స్థాన చలనం తప్పలేదు. పెడన ఎంఎల్‌ఎగా ఉన్న ఆయనను అక్కడి నుండి మార్పు చేసి పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించారు. దీంతో పెనమలూరు వైసిపి ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథికి ఈసారి టికెట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పెనమలూరు సిట్టింగ్ ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథిని గన్నవరం నుంచిగానీ, మచిలీపట్నం ఎంపి స్థానానికిగానీ పోటీ చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోరినట్లు తెలిసింది. దీనిపై పలు దఫాలు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు పార్థసారథితో చర్చించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలోనే



వరుసగా సారథి, నాని, జోగి, రాము

ఆయన గత కొంతకాలంగా టిడిపి నేతలతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం హైదరాబాదులో చంద్రబాబును కలిసి చర్చించనున్నట్లు సమాచారం. ఈనెల 18వ తేదీన గుడివాడలో జరిగే ఆ పార్టీ బహిరంగ సభలో చంద్రబాబు సమక్షాన (మిగతా 6లో)



సిఎం జగన్‌తో నల్లగట్ల స్వామిదాసు, సుధారాణి

వైసిపిలోకి మాజీ ఎంఎల్ఎ నల్లగట్ల


ప్రజాశక్తి - తిరువూరు : టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌ఎ నల్లగట్ల స్వామి దాసు, ఆయన సతీమణి ఉమ్మడి కష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎంపి అయోధ్య రామిరెడ్డి, ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి వెళ్లి సిఎంను కలిశారు. దీంతో నలగల్ల స్వామిదాసును తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా నియమించే (మిగతా 6లో)

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో రూ.33.64 కోట్లు జమ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : చిరువ్యాపారులు, సంప్రదాయ చేతివత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలుచేస్తోందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు ఎంతగానో మేలు చేస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి జగనన్న తోడు 8వ విడత కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలో 3.95 లక్షల మంది చిరు వ్యాపారులకు కొత్తగా రూ.418 కోట్ల వడ్డీ లేని రుణాలను, 5.81 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13.64 కోట్ల వడ్డీ తిరిగి చెల్లింపుతో కలిపి మొత్తం రూ.431.58 కోట్లను బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా కలెక్టరేట్ విసి హాలు నుండి వర్చువల్ విధానంలో పాల్గొన్న కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో గత నాలుగేళ్లుగా సుమారు 59 వేల మంది చిరు వ్యాపారులకు రూ.130 కోట్ల వడ్డీ లేని బ్యాంకు (మిగతా 6లో)





మచిలీపట్నం, విజయవాడలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు, జెసి పి.సంపత్‌కుమార్ తదితరులు



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, విఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కెవి.సత్యవతి, ఎం.ప్రభాకరరావు, డాక్టర్ పి.రత్నావళి

స్వచ్ఛ సర్వేక్షన్‌లో విఎంసికి అవార్డు

జాతీయ స్థాయిలో ఆరో స్థానం

ప్రజాశక్తి - విజయవాడ : స్వచ్ఛ సర్వేక్షన్- 2023 అవార్డుల్లో విజయవాడ నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో పలు అవార్డులను సొంతం చేసుకుంది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఆరో స్థానం సాధించింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర గహ నిర్మాణ, పట్టణాభివద్ధిశాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఆ శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ రూప మిశ్రా చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ అవార్డును అందుకున్నారు. కేంద్రం (మిగతా 6లో)

విఎంసిలో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థలోని ఆరు ప్రత్యేక కమిటీలకు చైర్‌పర్సన్, డిప్యూటీ చైర్‌పర్సన్‌లను ఎన్నుకున్నారు. విఎంసి కౌన్సిల్ సెక్రటరీ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. సభ్యులందరూ గురువారం సమావేశమై ఆరు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. వాటి వివరాల ప్రకారం... మంచినీటి సరఫరా భూగర్భ నీటిపారుదల ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా అబ్దుల్ అకీబ్ అర్షద్ (54వ డివిజన్ కార్పొరేటర్), డిప్యూటీ చైర్మన్ వియ్యపు అమర్నాథ్ (ఆరవ డివిజన్), క్రీడలు, ట్రాఫిక్ ప్రత్యేక కమిటీకి చైర్ పర్సన్‌గా పుప్పాల నరస కుమారి (21వ డివిజన్), డిప్యూటీ చైర్ పర్సన్ ఉమ్మడి రమాదేవి (61 డివిజన్), రోడ్లు డ్రైన్లు వంతెనలు భవనముల నిర్మాణం ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా యార్లగడ్డ ఆంజనేయ రెడ్డి (40వ డివిజన్), డిప్యూటీ చైర్మన్ కలపాల అంబేద్కర్ (ఐదవ డివిజన్), లైటింగ్ పార్కుల అభివద్ధి ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా అలంపురం విజయలక్ష్మి (62వ డివిజన్), డిప్యూటీ చైర్మన్ బుల్లా విజయ్ కుమార్ (49వ డివిజన్), ప్రజా ఫిర్యాదుల ప్రత్యేక కమిటీ చైర్ పర్సన్‌గా కొండాయగుంట మల్లీశ్వరి (27వ డివిజన్), డిప్యూటీ చైర్మన్ చాపట్టి కోటిరెడ్డి (43వ డివిజన్), మురికివాడల అభివద్ధి ప్రత్యేక కమిటీ చైర్పర్సన్‌గా ఉద్దంటి సునీత (ఒకటవ డివిజన్), డిప్యూటీ చైర్మన్ గుడివాడ నరేంద్ర రాఘవ (39వ డివిజన్) ఎన్నికయ్యారు.





రైల్వే అధికారులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

డిఆర్ఎంతో ఎంఎల్ఎ విష్ణు భేటీ

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ తో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రైల్వే పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా శ్రీనగర్ కాలనీలో రైల్వే శాఖ కట్టిన గోడల వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మల్లాది విష్ణు డీఆర్ఎం దష్టికి తీసుకువెళ్లారు. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసరంగా బయటకు వెళ్లే వారు.. బీఆర్టీఎస్ రోడ్డుకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. శ్రీనగర్‌ను సత్యనారాయణపురం రైల్వేకాలనీని కలిపే రహదారిని పునరుద్ధరించాలని కోరగా.. తానే స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిఆర్ఎం తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో పలు పెండింగ్ పనులపై చర్చించారు. గుణదల, వాంబే కాలనీలలో గతి శక్తి ప్రాజెక్టు కింద చేపట్టాల్సి ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) ల నిర్మాణాలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వెలువడేలా చొరవ చూపాలని, ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరగా.. డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. సమీక్షలో ఈఈ-2 (ఇంజనీరింగ్) వి.శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-భవానీపురం: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని భవానీపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురం స్టేషన్ పరిధిలోని రామరాజ్యనగర్‌లో షేక్ బాషా అలియాస్ సతీష్ అలియాస్ వంశీ నివసిస్తుంటాడు. ఈ మధ్యకాలంలో భవానీపురం పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌లు దొంగతనం చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసలు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు సేకరించిన ఆధారాల మేరకు గురువారం భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల రామరాజ్యనగర్ కట్ట వద్ద చెట్ల పొదలలో అనుమానితుడైన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా రామరాజ్యనగర్‌కు చెందిన షేక్ బాషా అలియాస్ సతీష్‌ను అదుపులోకి తీసుకుని నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు చోరీ చేయబడిన నాలుగు బైక్‌లు సుమారు రూ. 2.15 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భవానీపురం సిఐ వి. కృష్ణ తెలిపారు.



నిందితునికి జైలు, జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: నున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని పాయకాపురం సుందరయ్య నగర్ కు చెందిన బాధితురాలు పిర్యాదు మేరకు 2022 నవంబర్ 18న నిందితుడు పసుపు లేటి రాము, 10 సంవత్సరాల పాప స్కూల్ నుండి ఇంటికి వెళుతున సమయంలో ఇంటికి పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై పాప తల్లి దిశా పోలీస్ స్టేషన్ కు వచ్చి సదరు సంఘటన పై ఫిర్యాదు చేశారు. దిశా మహిళా సబ్‌ఇన్స్పెక్టర్ రేవతి సదరు ఘటనపై దర్యాప్తు చేసి 2022 నవంబర్ 20న నిందితుడైన పసుపులేటి రాము (50 సం.) ను అరెస్ట్ చేసి చార్జ్ షీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున గురువారం (11వ తేదీ) విజయవాడ జడ్జి డా. ఎస్. రజిని నిందితుడైన పసుపులేటి రాముకు 5 సంవత్సరాల కఠిన కారాగారశిక్షా , రూ.25 వేలు జరిమానా విధిస్తూ, సదరు బాధిత బాలికకు జరిమానా నుండి రూ.20 వేలు, రూ.50 వేలు నష్టపరిహారం వచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ జి.నాగి రెడ్డి ,సి.యమ్.ఎస్. ఇనస్పెక్టర్, దిశా మహిళా సబ్‌ఇన్స్పెక్టర్ రేవతి పర్యవేక్షణలో ఏడుగురు సాక్షులను విచారించినట్లు నున్న పోలీసులు వివరించారు.

జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు : ఎసిపి



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు, పేకాట, జూద క్రీడలు మరియు ఎటువంటి ఆ సాంఘిక కార్యకలాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నందిగామ ఎసిపి కె జనార్దన్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీపీ జనార్దన్ నాయుడు మాట్లాడుతూ కోడిపందాలు, కోడి కత్తులు తయారీదారులు, పేకాట నిర్వాహకులపై మరియు కోడిపందాల బర్లు సిద్ధం చేయు వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని, వారిపై గట్టి నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశపడి పందాలు కాసి వారి యొక్క దానాన్ని నష్టపోతున్నారు అన్నారు. దీనివల్ల వారి కుటుంబాలలో పండగ పూట వారి యొక్క కుటుంబ సభ్యులలో ఆనందంగా పండగను నిర్వహించుకోవాలని, జూధా క్రీడలకు దూరంగా ఉండాలని తెలిపారు. కోడిపందాలు, జూదం నిర్వహించకుండా ఉండేందుకు గతంలో వీటిని నిర్వహిస్తూ మరియు ఆడుతూ పట్టుబడిన వారు మరల వాటి జోలికి వెళ్లకుండా బైండోవర్ చేయడం జరిగిందన్నారు. గతంలో కోడిపందాలు, పేకాట నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచమన్నారు. పండుగ రోజులలో యువత సంప్రదాయ క్రీడలైన కబాడ్డి, కోకో, వాలీబాల్, క్రికెట్, బ్యాట్మెంటన్ క్రీడల్లో పాల్గొని అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్, జగ్గయ్యపేట ఎస్సై ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

వాహిని విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-తిరువూరు: కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యా లయంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 2024 అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్, శరీరధారుఢ్య పోటీ లో ఛాంపియన్షిప్ తిరువూరు శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కైవసం చేసుకున్నాడు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న కుంభ అజయ్ పవర్ లిఫ్టింగ్ 83 కేజీల విభాగంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి బంగారం పథకం సాధించాడు. దీనితోపాటు ఈ విద్యార్థి 75 కేజీల శరీరధారుఢ్య విభాగంలో కూడా పాల్గొని తతీయ స్థానంలో నిలిచి కాంస్య పథకం సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పథకాలు సాధించిన విద్యార్థి అజయ్ ను కళాశాల కోశాధికారి ఎం. కిషోర్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.సురేష్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.హరికృష్ణ, డీన్ కిరణ్ కుమార్, క్రీడల కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.పాపారావు అభినందనలు తెలిపారు.



పెరుగుతున్న గుడ్డు ధరతో పరేషాన్

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మార్కెట్లో కోడిగుడ్డు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజు రోజుకీ కోడి గుడ్డు భారమవుతుంది. వారం రోజుల్లో డజన్ గుడ్ల ధర ఏకంగా రూ. 96కు చేరింది. దీంతో ఒక్క గుడ్డు రూ. 8 రూపాయలు పలుకుతుంది. కోళ్ల దాణా రేట్లు పెరగడం వలన గుడ్డు రేటు రేటు పెరిగిందని కోళ్ల ఫారం నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో కోళ్ల దాణా కిలో 15 నుంచి 17 రూపాయలు ఉండేది. ఇప్పుడు అది రూ. 30 కు చేరుకుంది. డిమాండ్ కు తగ్గట్టు గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో కోడి గుడ్డు ధర పెంచక తప్పడం లేదని అంటున్నారు. మరో వైపు గుడ్ల రవాణా కూడా భారంగా మారిందని, ఇది కూడా గుడ్డు ధర పెరగడానికి కారణమని చెబుతున్నారు. రోజుకు 15 నుంచి 20 వేలు అమ్మకాలు జరుగుతున్నాయని, డిమాండ్ ఇలాగే ఉంటే కోడిగుడ్డు రేటు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజాగా, నేడు కోడి గుడ్డు ధరలు భారీగా తగ్గాయి. గన్నవరం డివిజన్లో గత నెలలో ఒక్క గుడ్డు ధర రూ. 5.83 ఉండగా.. డజన్ రూ.69.96 గా ఉండేది. ప్రస్తుతం ఒక్కసారిగా గుడ్డు ధర పెరగడంతో సామాన్యులు ధర వింటే పరేషాన్ చెందుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన గుడ్ల ధరలు పై పైకి పెరుగుతున్నాయని, ఇందులో వ్యాపారుల మాయాజాలం ఉందని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు పెరుగుతున్న ధరలపై పరిశీలన చేసి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

అద్భుత కళాఖండంగా అంబేద్కర్ స్మృతివనం

ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

ప్రజాశక్తి-విజయవాడ

ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండంగా అంబేద్కర్ స్మతి వనాన్ని తీర్చి దిద్దారని రాష్ట్ర ఎస్.సి. కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మతి వనాన్ని గురువారం విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 400 కోట్ల ఖర్చుతో పెడస్టల్ (దిమ్మ)తో కలిపి 205 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మించడం చారిత్రక ఘట్టమని అన్నారు. ప్రపంచంలోనే ఒక అద్భుతమైన కళాఖండంగా అంబేద్కర్ స్మతి వనాన్ని నిర్మించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. విజయవాడకే సెంటర్ అఫ్ అట్రాక్షన్ గా నిలిచిన అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది తరలి రానున్నారని అయన అన్నారు. ఈక్వాలిటీ అఫ్ లిబర్టీ కి ప్రతిరూపంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ స్మతి వనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారని అయన అన్నారు. అంబేద్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అందరి వాడైనా అంబేద్కర్ స్మతి వనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారన్నారు. విశ్వజ్ఞాని, భారతదేశంలో కుల రుగ్మతలను భూస్థాపితం చేసిన అంబేద్కర్ వంటి మహోన్నతమైన వ్యక్తి విగ్రహాన్ని ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఎంతో చరిత్రాత్మకం అన్నారు. ప్రతీ ఒక్కరినీ ఆకర్షించే విధంగా డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహంతో పాటు అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్ లు, లైబ్రరరీ వంటి వాటితో అంబేద్కర్ స్మతి వనాన్ని సర్వాంగ సుందరంగా ప్రభుత్వం తీర్చి దిద్దిందన్నారు. ఈ నెల 19న పండుగ వాతావరణంలో అంబేద్కర్ స్మతి వనాన్ని ప్రారంభించుకోవడం రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో గర్వకారణమని, ఈ కార్యక్రమానికి లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని రాష్ట్ర ఎస్. సి. కమిషన్ చైర్మన్ శ్రీ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు.



జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి



అవనిగడ్డలో మాట్లాడుతున్న డిఎస్పి మురళీధర్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో జూద క్రీడలకు అనుమతిలేదని దాన్ని అతిక్రమించి నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకో వాల్సి వస్తుందని డీఎస్పీ పి. మురళీధర్ హెచ్చరించారు. గురువారం అవనిగడ్డ పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూ ధక్రీడలు వద్దు సంప్రదాయ ఆటలు ముద్దు అంటూ చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా అవనిగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ కోడూరు నాగాయలంక మోపిదేవి చల్లపల్లి ఘంటసాల మండలాల్లో సంక్రాంతిని పురస్కరించుకొని జూద క్రీడలకు ఎటువంటి అనుమతి లేదని తెలిపారు జూద క్రీడలు ఆడే వారిని వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కోడి పందాలు పేకాట గుండాట వంటి క్రీడలు చట్టరీత్యా నేరమన్నారు. వాటిని అరికట్టేందుకు అన్ని మండలాల్లోనూ రెవెన్యూ మహిళా పోలీసుల సహకారంతో చర్యలు చేపట్టామ న్నారు. అదేవిధంగా ఇటువంటి అసాంఘిక క్రీడలలో పాల్గొని ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని కుటుంబ సభ్యులతో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని డి.ఎస్.పి మురళీధర్ కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ ఎల్ రమేష్ అవనిగడ్డ నాగాయలంక ఎస్సైలు జి రమేష్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి** : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి కోడి పందేలు, పేకాట తరహా జూద క్రీడలకు అనుమతి లేదని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ హెచ్చరించారు. గురువారం చల్లపల్లి పోలీస్ స్టేషనులో మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందాలు తరహా జూదాలు నిర్వహిం చినా, పాల్గొన్నా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి కత్తులు తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం అన్నారు. అనవ సరంగా జూదాల్లో పాల్గొని సొమ్ము పోగొట్టు కోవద్దని సూచించారు. సమావేశంలో చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, చల్లపల్లి, మోపిదేవి ఎస్ఐలు సీహెచ్ చినబాబు, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు** : సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని కోడూరు మండలంలో కోడిపందాలు ,పేకాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని కోడూరు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కోడూరు మండలంలో ఎటువంటి కోడిపందాలకు జూదాలకు అనుమతులు లేవుని,అనుమతులు ఇచ్చినట్లుచెప్పి ఎవరైనా బరులు నిర్వహిస్తే వెంటనే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సాంప్రదాయ బద్ధంగా కబడ్డీ కోకో వంటి సాంప్రదాయ క్రీడలు నిర్వహిస్తే వారికి పోలీసు వారి సహకారం కూడా అందిస్తామని తెలిపారు. జూద క్రీడలు నిర్వహించిన, వాటిని ప్రోత్సహించిన, కోడి కత్తులు కట్టిన వారిపై కూడా బైండవర్ కేసులను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి నుంచి సావరగూడెం వెళ్లే రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతచెందాడు. ఆగిరిపల్లి మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన రాకేష్ అనే యువకుడు కేసరపల్లి గ్రామానికి బైక్ పై వేగంగా వస్తుండగా రోడ్డు మలుపు వద్ద బైకు కాలవలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన రాకేష్ అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



చెక్కును అందజేస్తున్న వెనిగండ్ల రాము

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త మెండెంపూడి కిరణ్ కుటుంబానికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఎన్నారై టిడిపి తరపున గురువారం 9 లక్షల 38 వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నారై అడుసుమిల్లి కష్ణప్రియ, గుత్తా గంగాధర్లతో కలిసి వెనిగండ్ల రాము మాట్లాడుతూ కిరణ్ కుమార్తె చదువుకు తమ వంతు సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగం ప్రసాద్, కొల్లి సుధాకర్, అందుగుల యేసు పాదం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జన భగీదరి' కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో ముందస్తుగా సామాజిక సమతా సంకల్పం(జన భగీదరి) పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు విస్తతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 508 గ్రామ వార్డు సచివాలయాలకు గాను ఇప్పటివరకు 498 గ్రామ వార్డు సచివాలయాల స్థాయిల్లో జరిగిన సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో 28,317 మంది పౌరులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ, భారత రాజ్యాంగంలోని ఉపోద్ఘాతంతో ప్రతిజ్ఞ చేస్తూ 27,079 మంది ఫ్లెక్సీ బ్యానర్ పై సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమాలు ఈనెల 12వ తేదీ వరకు అన్ని గ్రామ వార్డుల్లో జరగనున్నాయన్నారు. ఈనెల 18వ తేదీన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కోనేరు సెంటర్ నుండి లక్ష్మీ టాకీస్ (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలి) వరకు మారతాన్ పరుగు నిర్వహించడం జరుగుతుందన్నారు.




రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : పూర్వవిద్యార్థుల సంఘం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చల్లపల్లి ఎస్సార్ వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్, చంద్ర ఎరాజేశ్వరరావు వికాసకేంద్రం సహకారంతో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్. తహసీల్దార్ కె.గోపాలకష్ణ, రెడ్ క్రాస్ కష్ణాజిల్లా చైర్మన్ డాక్టర్ టిస్-ఎస్ఎస్.బాలజీ, సెక్రటరీ భవిరి శంకరనాథ్ లు శిబిరాన్ని సందర్శించి పర్యవేక్షించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలను అభినందిం చారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు టి.సాంబశివరావు, అధ్యక్షులు గోవిందరాజుల అశ్వినీకుమార్, కార్యదర్శి బీడీఆర్.ప్రసాద్, ప్రతినిధులు అడ్డాడ ప్రసాద్ బాబు, ఉప్పల నాంచారయ్య, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర తదితరులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతల నుంచీ 31 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

అంపాపురంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్దేనని ఆయన వ్యక్తి కాదని ఒక శక్తి అని టీడీపీ గన్నవరం ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో మోతుకూరి చిట్టిబాబు తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆయన అవిష్కరించారు. ఎన్టీఆర్ లాంటి గొప్పవ్యక్తి విగ్రహాన్ని మోతుకూరి చిట్టిబాబు తన స్వంత నిధులతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. పేదవారికి కిలోబియ్యం 2 రూపాయలకు అందిస్తూ చేనేత వస్త్రాలను ఉచితంగా అందించడంతో పాటు రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఎన్టీఆరేనని యార్లగడ్డ కొనియాడారు. తెలుగు వారి గుండెల్లో ఎప్పటికీ ఉండిపోయే వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి బెనర్జీ,



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన యార్లగడ్డ వెంకట్రావు

గొడ్డపాటి నాగరాజు, సర్నాల బాలాజీ, ఆళ్ల హనోక్, చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికళ్యాణి, జాస్తి వెం కటేశ్వరరావు, గొడ్డళ్ల రామారావు, వేగిరెడ్డి పాపారావు, మేడేపల్లి రమ, పొదిలి లలిత, మొవ్వా వెం కటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : ఈ నెల 13నుండి మూడు రోజుల పాటు పాండిచెరి రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి షఉటింగ్ బాల్ అండర్ 19 పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన మాదల కిరణ్ కుమార్ ఎంపికైయ్యాడు. నిరు పేద కుటుంబానికి చెందిన కిరణ్ కుమార్ ఆర్థిక పరిస్థితి లేని పరిస్థితులలో పోటీలలో పాల్గొనలేని స్థితిని కేసరపల్లి హై స్కూల్ వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు శ్రీదేవి ద్వారా గన్నవరం నియోజక వర్గ క్రీడా సామన్వయ కర్త ధనియాల నాగరాజు కు తెలుపగా గన్నవరం యం. పి.పి అనగాని రవి దష్టి కి నాగరాజు తీసుకు రావడంతో వెంటనే స్పందించిన అనగాని రవి కిరణ్ కుమార్ కు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి పోటీలలో పాల్గొనాలని ప్రోత్సహించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అనగాని రవి

కిరణ్ ప్రస్తుతం విజయవాడ సిద్దార్ద కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్య అభ్యసి స్తున్నాడు. గతంలో కూడా ఖో ఖో కబడ్డీ జాతీయ పోటీలలో పాల్గొని తన సత్తాచాటాడు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ అనిల్‌కుమార్

ధాన్యం కొనుగోలుకు చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలం ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్య తీసుకుంటామని పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి రైతులకు గిట్టుబాటు అయ్యే ధరను నిర్ణయిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై డి ఎం రాజు, గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి, ఎంపీపీ గోగం సురేష్ ,గోళ్ళ సోమేశ్వరరావు, మాజీ పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్ పాల్గొన్నారు.

పాక తొలగింపు దారుణం : సిపిఎం

ప్రజాశక్తి- గుడివాడ : ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో దళితుడు ఇంటిని అధికారులు అక్రమంగా తొలగించడాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి ఖండించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ నందివాడ మండలం జొన్నపాడు గ్రామంలో నివసిస్తున్న దారా ఆనందరావు కౌలుకు భూమి తీసుకుని సాగు చేయటం రీత్యా అప్పులపాలు అయ్యి తనకున్న స్థలాన్ని అమ్ముకుని అప్పులు తీర్చుకోవడం జరిగిందన్నారు. ఆ సందర్భంలో అతనికి వేరే గత్యంతరం లేక ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో గత 3 నెలలుగా పాక వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈపాక వేసుకోవడం ఇష్టం లేని గ్రామంలోని కొందరు వైకాపా నాయకులు దళితుడి పాక పీకటానికి ప్రభుత్వ అధికారుల ద్వారా విశ్వ ప్రయత్నాలు చేస్తూవచ్చారన్నారు. కొందరు అధికార పార్టీ నాయకులను అదికారుల ద్వారా అక్రమంగా పాక తొలగించడానికి నోటీసులు ఇచ్చి మరీ తొలగించారన్నారు. ప్రస్తుతం అతని కుటుంబం ఇప్పుడు నిలువ నీడ లేకుండా పోయిందని, ప్రభుత్వం ఆనందరావుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి దారం కరుణాకర్, రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకష్ణా రెడ్డి, దారా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అభినందనీయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగా హన కల్పిస్తూ సూపర్స్పె షాలిటీ వైద్య సేవల ందించడం అభినంద నీయమని మోహన్ స్పింటెక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వరరావు అన్నారు.రేమల్లె మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో క్రిబ్కో సహకా రంతో గురువారం మల్లవల్లి,రంగన్నగూడెం సింగన్నగూడెం,రేమల్లె గ్రామాల ప్రజలకు నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని క్రిబ్కే అధిపతి వసీం అక్రమ్తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ వైద్యశిబిరంలో వంశీ హార్ట్కేర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీచంద్ర, ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ దొరబాబు,రావెళ్ల కంటి ఆసుపత్రి డాక్టర్ వెంకటేష్, మోహన్స్పింటెక్స్' వైద్యుడు వెంకట్లు 900మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మోహన్ స్పింటెక్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ తాండవకష్ణ పర్యవేక్షణలో అవసరమైన వారికి మందులు,కళ్లజోళ్లు ఉచితంగా అందించే ఏర్పాటు చేశారు.

టిడిపి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణం 21వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నేతలతో కలిసి టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ మరియు జగ్గయ్యపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, 21వార్డ్ కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి, వైకుంఠేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేసి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేకా వెంకటేశ్వర్లు, బిసి నాయకులు కర్రీ చిన్న, కౌన్సిలర్స్ గోట్టే నాగరాజు, కర్ల జోజి, నకిరికంటి వెంకట్, ఇర్రి నర్సింహారావు, మొగిలి శ్రీనివాస్, పున్న ఉపేంద్ర. కనకరాజు, కావేటి కోటి, గంజనబోయిన శ్రీను, మార్తీ అచ్చయ్య, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** వత్సవాయి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేసి, టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల టిడిపి అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, నెల్లూరి శ్రీనివాసరావు, చిట్టూరి రమేష్, నెల్లూరి కోటేశ్వరరావు, ఉప్పుగండ్ల రాధాకష్ణ, కనతాల రామకృష్ణ, ఉప్పు గండ్ల వెంకటేశ్వరరావు, నరమనేని శ్రీనివాసరావు, నెల్లూరి చిన్న శ్రీను, చెన్న బాలకృష్ణ, బొల్లా వెంకటేశ్వరరావు, వడ్లమూడి అజేష్, కొలుసు లక్ష్మణ్, పెద్ద నారాయణ పాల్గొన్నారు.


వత్సవాయిలో...

ప్రకాష్‌నగర్‌లో కారు బీభత్సం

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: ప్రకాష్ నగర్‌లో గురువారం కారు బీభత్సవం సృష్టించింది. వేగంగా వచ్చిన కారు టిఫిన్ బండిని ఢీకొట్టి బైకులపై దూసుకుపోయింది. టిఫిన్ బండి నిర్వాహకురాలుకు తీవ్ర గాయాలు అవ్వడంతో స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గోవిందు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఒడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి-కంచికచర్ల: యుద్ధ వీరుడు, తొలి తరం స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలు గురువారం కంచికచర్ల లో ఘనంగా నిర్వహించారు. వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గొట్టుముక్కల రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల వడ్డెర సంఘ నాయకులు ఒంటిపులి ప్రసాద్, ఓర్సు నరసింహారావు, వల్లేపు శ్రీనివాసరావు, వేముల గురవయ్య, ఉప్పుతల తిరుపతిరాజు, ఉప్పుతల అప్పారావు, ఒంటిపులి బాబు, చింతల చంద్రకళ, ఒంటిపులి సురేష్ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** ఓబన్న చిత్రపటానికి మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం సాధికారిక రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే వెంకట్, తాళ్లూరు వెంకటేశ్వర్లు, డేవిడ్ పాల్గొన్నారు.


కంచికచర్లలో...

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఐద్వా ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల లో విజేతలకు బహుమతులు అందజేశారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో గహిణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె బేబీ సరోజినీ, ఎల్ పార్వతీ, ఉపాధ్యక్షురాలు ఎన్ కరుణ పాల్గొన్నారు.




విజయవాడలో...


జగ్గయ్యపేటలో...


మైలవరంలో...


నందిగామలో...

రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ

31వ రోజు అంగన్‌వాడీల సమ్మెలో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ: అంగన్‌వాడీల ముఖ్యమైన డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణకు సిద్ధమవ్వాలని పలు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ లో అంగన్‌వాడీల సమ్మె గురువారం నాటికి 31 వ రోజుకు, 24 గంటల నిరాహార దీక్ష ఏడవ రోజుకు చేరిన సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్ళ పైన నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని, అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని, నాణ్యమైన సరుకులు అందించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్రకన్వీనర్ కె సుబ్బరావమ్మ, కె ధనలక్ష్మీ మాట్లాడుతూ... అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని దుయ్యబట్టారు. ఉద్యమం ఉధృతం రూపం దాలిస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనాలు, గ్రాట్యూటీ డిమాండ్లపై యూనియన్లను చర్చలకు పిలిచి పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీల ఉద్యమం లబ్ధిదారులతో పాటు సామాన్య ప్రజానీకం మద్దతును కూడా పొందిందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు నాణ్యమైన ఆహార సరఫరాకు అవసరమైనంత బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు దయా రమాదేవి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎల్ బాలాజీ, అంగన్వాడి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి బేబీ రాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.గజలక్ష్మి, రత్నకుమారి, ఉమాదేవి, ఎల్లా రాణి, కె.పోలారి తదితరులు పాల్గొన్నారు. **మైలవరం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయా ఆవరణలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి ఆర్ రమేష్ బాబు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మైలవరం, జి కొండూరు మండల కార్యదర్శులు సిహెచ్ సుధాకర్, కె.బాలకృష్ణ, అంగన్వాడి హెల్పర్స్ అండ్ యూనియన్ నాయకులు పుష్పకుమారి, సిహెచ్ శారద, రబ్బాని, మాణిక్యం, విజయలక్ష్మి, నిర్మల, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** తహసిల్దార్ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సాష్టాంగ నమస్కారాలు పెడుతూ గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం ఇవ్వాలని సున్నాలా కూర్చొని అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాము, ప్రజాసంఘాల నాయకులు కోట కృష్ణ ,అంగన్వాడి యూనియన్ నాయకులు టి మధుకుమారి, అంజమ్మ, విశాలాక్షి, సువర్చల, రత్నకుమారి, లక్ష్మీ, మేరి, లీల జానమ్మ, ఉమారాణి, ఖాజాబి, హసీనా తదితరులు పాల్గొన్నారు. **అజిత్ సింగ్ నగర్:** సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య భవన్‌లో అంగన్వాడి వర్కర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిగే చర్చలు సఫలీకతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సెంట్రల్ సిటీ సిఐటియు అధ్యక్షులు కె.దుర్గారావు, రమాదేవి, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, కొల్లి సరళ, మహాలక్ష్మి, వెంకట్రావమ్మ, సుజాత, వేణు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి : చైర్మన్



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 11 వ వార్డు స్థానిక దుర్గాపురంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం పర్యటించారు. అక్కడ స్థానికులను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ప్రజలు డ్రైనేజీ వ్యవస్థతో ఇబ్బంది కలుగుతుందని తెలియజేయగా, త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థను అభివద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవాని ప్రసాద్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి తిరుపతమ్మ రంగుల మహోత్సవం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవంను విజయవంతం చేయాలని నందిగామ ఆర్ డివో కె.సాయిబాబా పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి జరగనున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహెూత్సవంనకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె రమేష్ నాయుడు అధ్యక్షతన ఆలయం నందు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను అధికారులు సమిష్టిగా పని చేయాలని కోరారు. సమావేశానికి కొంత మంది అధికారులు హాజరు కాకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరూ యాక్షన్ ప్లాన్ తయారు చేసే ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారో తనకు పంపించాలని ఆదేశించారు. ఉత్సవాల్లో ముఖ్యంగా పారిశుధ్యం పనులు, త్రాగునీరు, వంటి సౌకర్యాలను అందించాలని అన్నారు. కాగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే రంగుల మహెూత్సవం సమీక్ష సమావేశాన్ని తూతూ మంత్రంగా అధికారులు నిర్వహించారు. సమావేశం నిర్వహించటంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారు. కనీసం భాధ్యత కలిగిన అధికారులు హాజరు కాకపోవడం విచారకరం. సమావేశానికి హాజరు కాలేకపోయిన ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏ మేరకు పని చేస్తారో అని భక్తులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిబాబా

అభివృద్ధి పనులపై చర్చ

స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పాలక మండలి సమావేశం గురువారం చైర్మన్ ఛాంబర్ నందు ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆలయ వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, మరియు రంగుల మహోత్సవంనకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు, ఏర్పాటు పలు అంశాలపై చర్చించి తీర్మాణం లు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, ఎయివో ఉమాపతి ఆలయానికి సంబంధించిన వివిధ అంశాలు గురించి పాలక మండలి సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరావు, ధర్మకర్తలు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కేశినేని పార్టీ మారితే నష్టమేమీ లేదు : టిడిపి

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: టిడిపి తెలుగుదేశం పార్టీ ఎంపీ కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేశ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని ఇబ్రహీంపట్నం మండల తెలుగు దేశం పార్టీ నాయకులు మరియు కొండపల్లి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు ఖండించారు. ఇబ్రహీంపట్నం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశినేని నానిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేశినేని నాని పోతే పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదు అన్నారు. పూర్తి స్థాయిలో ఎంపీ నిజ స్వరూపం బయటకు రావడంతో అనుమానాలు లేకుండా క్యాడర్ సంతోషంగా ఉన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ గెలిచి రెండేళ్ల గడిచిన కోర్టుల్లో అధికార పార్టీతో ములకత్ అయ్యి పార్టీకి ద్రోహం చేసి ఆయన్ను నమ్మిన నాయకులను, కొండపల్లి ప్రజలను మోసం చేశారన్నారు. రెండు పర్యాయాలు పార్టీ బి ఫారం ఇస్తే గెలిచి నేడు అధిష్టానంపై పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారు అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఎంపీ కేశినేని నాని మంచి చేసేవారు ఎవరో ముంచే వారు ఎవరో తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రామినేని రాజా, కౌన్సిలర్లు చుట్టుకుదురు శ్రీనివాసరావు, చెన్నుబోయిన చిట్టిబాబు, రావి ఫణి, ధరణికోట విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై బెదిరింపులు శోచనీయం

- సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంగన్వాడీ కార్యకర్తలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే రాష్ట్ర బంద్ చేపట్టడానికి కూడా వెనుకాడమోమని సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడి కార్యకర్తల డిమాండ్స్ పరిష్కరించాలని గత నెల రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిరంకుశ వైఖరి అవలంబించడాన్ని నిరసిస్తూ అంగన్వాడి కార్యకర్తల హామీలను అమలు చేయాలని, వారిపై పెట్టిన ఎస్మా చట్టాన్ని ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తల సమ్మెకు మద్దతుగా గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల, కార్మిక, రైతు సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై నరసింహారావు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కన్న వెయ్యి రూపాయలు అదనంగా పెంచాలని ,గ్రాడ్యుటి అమలు చేయాలని అడుగుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఇచ్చిన హామీల అమలు చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి తెలియజేసే సమ్మెలోకి వెళ్లిన అంగన్వాడి కార్యకర్తలను మొదటి నుండి భయభ్రాంతులకు గురి చేస్తూ హక్కులను భరిస్తుందన్నారు. సమ్మె చట్టబద్ధత అని కూడా ప్రభుత్వ పెద్దలకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని లేని పక్షంలో కలిసొచ్చే పార్టీలన్నిటినీ కలుపుకుని రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. సిపిఐ, జిల్లా నాయకులు లింగం పిలిఫ్ మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కొరకు చేసే పోరాటాలకు సిపిఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని పైగా న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని అడుగుతున్న అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించడం సమంజసం కాదన్నారు. టిడిపి, టి.ఎన్.టి యు.సి నాయకులు పంచపర్వాల కాశి విశ్వనాథ్, సిపిఐ (ఎంఎల్) మచిలీపట్నం నాయకులు బి. వెంకట్రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రఘు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు,ే కవీపీఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్,ఎల్ఐసి డివిజనల్ ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కుమార్ లు మాట్లాడిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం, పట్టణ కార్యదర్శి బూర సుబ్రహ్మాణ్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోలినాయుడు, కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. గోపాలరావు.కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ నాయకులు టి చంద్రపాల్ ,సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జై రావు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, ఉపాధ్యక్షులు సిహెచ్ నాంచారమ్మ, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శిఏ.రెజీనా రాణి, ప్రాజెక్ట్ నాయకులు కే లక్ష్మి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.నరసింహారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్టీఆర్ టు వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. గురువారం స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ లో ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) ఆయన సోదరుడు చిన్నిలు ప్రతి సంవత్సరం నిర్వహించే ఎడ్ల బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎడ్ల బండలాగుడు, కోడిపందాలు, ముగ్గుల పోటీలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అనంతరం ప్రదర్శనలు పాల్గొన్న పశు పోషకులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎంపీపీ గద్దె పుష్పరాణి, నాయకులు పాలేటి చంటి, పాలడుగు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ నీలం సంతోషమ్మ మృతి



నీలం సంతోషమ్మ (ఫైల్)

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరానికి చెందిన రిటైర్డ్ టీచ˝ర్ నీలం సంతో షమ్మ (70) గురు వారం మ రణిం చా రు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయరాలుగా పనిచేసి ప్రజల మనలను పొందారు. ఆమె కుమారుడు నీలం ప్రవీణ్ కుమార్ గన్నవరం సర్పంచిగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులుగా ఉన్నారు. వైయస్ఆర్సీపీ నాయకులు, గ్రామానికి చెందిన ప్రముఖులు, ఉపాధ్యాయులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఫోన్ చేసి నీలం ప్రవీణ్ కుమార్ ను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయంత్రం పట్టణంలో ఆమె భౌతిక కాయానికి అంతిమయాత్ర జరిగింది. స్మశాన వాటికలో అంతిమక్రియలు నిర్వహించారు.

బిసిల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గత ఎన్నికల్లో మోసపు మాటలతో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి అయన అధికారంలో ఏ ఒక్క సామజిక వర్గానికి న్యాయం చేయలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి గద్దెనెక్కినప్పటి నుండి బీసీ లపై జరుగుతున్న అన్యాలను ,అక్రమాలను నిరసిస్తూ పార్లమెంట్ కార్యాలయం లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణరావు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బీసీలకు ఎం అబివద్ధి చేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ముఖ్యం గా రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ ల అభ్యున్నతి ఒక్కటి కూడా చేయకపోగా తెలుగుదేశం పార్టీ హయాంలో ఉన్నటువంటి పథకాలను రద్దు చేసి వారి అభివద్ధికి అడ్డుకట్ట వేశారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో బీసీలకు రక్షణకు,మనుగడకు అవకాశం లేకుండా అణగదొక్కే విధంగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మాణ్యం (బోస్), జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ,ర్పొరేటర్లు చిత్తజల్లు రాము ,అన్నం ఆనంద్ ,దింటకుర్తి సుధాకర్ ,దేవరపల్లి అనిత ,మరకాని సమతా కీర్తి పాల్గొన్నారు .



మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

లాల్ బహుదూర్ శాస్త్రి వర్ధంతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత మాజీ ప్రధాని కీర్తిశేషులు లాల్ బహుదూర్ శాస్త్రి వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం టిడిపి ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రంలో నిర్వహించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాల్ బహుదూర్ శాస్త్రి నిరాడంబరతను ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, పార్టీ నాయకులు మండలి రామ్మో హన్రావు పాల్గొన్నారు



బ్లాక్ కోఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా) : జిల్లాలో కాంట్రాక్టు పద్ధతిలో పోషణ అభియాన్ స్కీమ్ ఒక సంవత్సరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో బ్లాక్ కోఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ జిల్లా మహిళా మరియు శిశు అభివద్ధి మరియు సాధికారత అధికారిణి శ్రీమతి ఎస్. సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బిసీ(ఎ) మహిళ, ఎస్టీ మహిళ. ఓసీ మహిళ వయస్సు 21 సంవత్సరం నుండి 42 సంవత్సరం మధ్య ఉన్న అభ్యర్థులు డిగ్రీ మరియు రెండు సంవత్సరాల టెక్నాలజి అండ్ సాఫ్ట్వేర్ అప్లికేషన్స్ అనుభవం కలిగి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులు కష్ణాజిల్లా పరిధిలో ఉన్న వారు మాత్రమే ఈ దరఖాస్తులను డోర్ నెం.1, ఉమాశంకర్ నగర్, అకాడమీ రోడ్డు, ఎస్ఎస్ఆర్ 93-6, కానూరు అడ్రస్సుకు రిజిస్టర్ పోస్టు ద్వారానే 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు చేసుకోవాలని సూచించారు. నెలకు 20 వేల రూపాయలు వేతనం చెల్లిస్తారన్నారు. ఈ దరఖాస్తు చేసుకొనేందుకు పూర్తి వివరాలు తెలుసుకోవాలని అనుకునేవారు 7901597290, 9949331320 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అగ్ని ప్రమాద కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం మంగినపూడి గ్రామానికి చెందిన గోవాడవీర రాఘవులు కు చెందిన ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణకి గ్రామస్తులు టిడిపి నాయకులు తెలియజేయడంతో బుధవారం రాత్రి బండిరామకష్ణ గోవాడ వీరరాఘవులు దంపతులకు 5000 రూపాయలు నగదును అందించారు. గ్రామస్తులు కూడా స్పందించి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు మెండు భానుమూర్తి, గోవింద్, నాగేశ్వరరావు, గళ్ళ తిమోతి, గడ్డంరాజు,వంపుగడవల చౌదరి,మోకా రవి జనసేన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కరుణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య సతీమణి తోట కరుణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ఆర్సిపి పార్టీలో సీనియర్ నాయకుడిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నియోజకవర్గ కాపు ఐక్య సమ్మేళనం అధ్యక్షులుగా ఉన్న తోట వెంకయ్య కుటుంబానికి పార్టీ సముచిత స్థానం కల్పించింది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తోట అరుణకు నియోజకవర్గం లో ఎమ్మెల్యే తర్వాత ప్రాముఖ్యత గలఏఎంసీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టింది. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, వైసీపీ నాయకులు అబుల్ కలాం, కందిమళ్ల శ్రీనివాసరావు, మేచినేని బాబు లు తోట దంపతులకు పుష్పగుచ్చాలు అందజేసి, దుస్సాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అనగాని రవి.. సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు సమచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని, అరుణకు ఏఎంసీ పదవి ఇవ్వడమే అందుకు నిదర్శనమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పోటీ చేసి మరోసారి గెలుపొందడం ఖాయమన్నారు. తోట వెంకయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వంశీ మోహన్ వేరొక నియోజకవర్గానికి బదిలీ అవుతు న్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరు నమ్మవద్దని, సీఎం జగన్మోహన్ రెడ్డి గన్నవరం వైఎస్ఆర్సిపి టికెట్ ను వంశీకి కేటాయిస్తూ ఎప్పుడో హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. గన్నవరం నుంచి వంశీ పోటీ చేస్తారని, 30 వేల మెజార్టీతో గెలుపొందుతారని వివరించారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోని కాపులను అందరినీ ఐక్యం చేసి వైసిపి విజయానికి శక్తివంచన లేకుండా కషి చేస్తానని వైయస్సార్సీపి బాపులపాడు మండలం నాయకులు శేషగిరిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, పార్టీ నాయకులు, వింత శంకర రెడ్డి, కలాం, డొక్కు వెంకన్న బాబు, పడమట సురేష్, సీనయ్య, వింత అధినారాయన రెడ్డి, తులిమిల్లి ఏడుకొండలు, రాచేటి రూతుమ్మ పాల్గొన్నారు.



తోట వెంకయ్య, కరుణలను సన్మానిస్తున్న దృశ్యం

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమని మండల ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య అన్నారు. గురువారం మండలంలోని కష్ణాపురం శివారు ముసలినాయకపాలెంలో రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, రెడ్డిగా కార్పొరేషన్ డైరెక్టర్ పరస జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌సిఐ బృందం పర్యటన

ఆర్‌బికె, ఎంఎల్ఎస్ పాయింట్ల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) జనరల్ మేనేజర్ విజయ్ కుమార్, ఏజిఎం రాఘవేంద్ర సింగ్ తదితరులు గురువారం విజయవాడ, గొల్లపూడి రైతు భరోసా కేంద్రాన్ని, ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల నుంచి జరుగుతున్న ధాన్యం సేకరణ, ఆన్‌లైన్‌లో భూమి, పంట వివరాల నమోదు, గోనె సంచుల లభ్యత, రైతులకు నగదు చెల్లింపులు, ధాన్యం రవాణా ఛార్జీలు, హమాలీ ఖర్చుల చెల్లింపు తదితర వివరాలను ఆర్‌బికే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులతోనూ మాట్లాడారు. ఆర్‌బికే సందర్శన తర్వాత గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించి గోదాములో ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకు సరుకుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిఐ డివిజనల్ మేనేజర్ దుష్యంత్, ఏజిఎం (క్యూసి) శ్రేయవీర్‌మణి, మేనేజర్ (క్యూసి) ఇ.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో అంబేద్కర్ కాలనీ క్రికెట్ టీమ్ గెలుపు

ప్రజాశక్తి - విజయవాడ : ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న "ఆడుదాం ఆంధ్ర"లో భాగంగా గురువారం మధురనగర్ 207 సచివాలయం పరిధిలో గల సాయిబాబా కాలనీ క్రికెట్ టీమ్, ముత్యాలంపాడు 213 సచివాలయం పరిధిలో అంబేద్కర్ కాలనీ క్రికెట్ టీమ్ పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన సాయిబాబా కాలనీ టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన అంబేద్కర్ కాలనీ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 160 పరుగులు చేసింది. 161 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సాయిబాబా కాలనీ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 85 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో 76 పరుగుల తేడాతో అంబేద్కర్ కాలనీ క్రికెట్ టీమ్ విజయం సాధించింది.



విజయం సాధించిన అంబేద్కర్ కాలనీ క్రికెట్ టీమ్ సభ్యులు

26న లౌకిక జనకవనం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రిపబ్లిక్ డే సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఈనెల 26వ తేదీ ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు 'లౌకిక జనకవనం' నిర్వహించనున్నారు. విజయవాడ రాఘవయ్యపార్కు సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం 4వ అంతస్తులో జరిగే ఈ కవి గాయక సమ్మేళనానికి మతతత్వ ధోరణులను నిరసిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక విలువలను ప్రతిఫలించే, ప్రబోధించే కవితా స్వరాలకు, గాయకులకు ఆహ్వానం పలుకుతున్నారు.

వివరాలకు కెంగార మోహన్ (9000730403), వొరప్రసాద్ (9490099059)లను సంప్రదించవచ్చు.



హనుమాన్‌జంక్షన్లో బాహాబాహీకి సిద్ధమైన జనసేన పార్టీ గ్రూపులు

బస్తీమే సవాల్

స్థల వివాదంపై జనసేన నేతల మధ్య ఘర్షణ

జంక్షన్లో ఉద్రిక్తత

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ : ఓ ప్రైవేటు స్థలం సరిహద్దుపై గత కొన్ని నెలలుగా జరుగుతున్న 'పంచాయితీ' గురువారం ఘర్షణకు దారితీసింది. స్థల వివాదమై సెటిల్మెంట్ చేస్తున్న సమయంలో జనసేన పార్టీకి చెందిన రెండు గ్రూపుల వారు సవాళ్లు విసురుకోవడంతో హనుమాన్ జంక్షన్ కూడలిలో 20 నిమిషాలపాటు ఉద్రిక్తత నెలకొంది. హనుమాన్ జంక్షన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువైపుల వారిని చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. సేకరించిన వివరాల ప్రకారం....మండల కేంద్రమైన బాపులపాడు గ్రామం ఇందిరానగర్ కాలనీలో ఒక స్థలం సరిహద్దు విషయంలో గత కొన్ని రోజుల నుంచి వివాదం నడుస్తోంది. గురువారం ఉదయం మరోసారి చర్చలు జరుపుతున్న సమయంలో మధ్యవర్తుల మధ్య మాటలు పెరిగాయి. జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి చలమలశెట్టి రమేష్ బాబు, అదే పార్టీకి చెందిన గరికిపాటి శివ పరస్పరం దూషించుకున్నారు. ఈసమయంలోనే కొందరు చలమలశెట్టిపై దాడికి ప్రయత్నించారు. సమయాన్ని ముందే చెప్పుకొని సాయంత్రం 4 గంటల సమయంలో గరికపాటి శివ, చలమలశెట్టి రమేష్ బాబు, వారి అనుచరులు జంక్షన్ సెంటరుకు భారీగా చేరుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో హనుమాన్ జంక్షన్ పోలీసులు అక్కడికి చేరుకొని రెండు గ్రూపుల వారిని చెదరగొట్టారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. స్థానిక ప్రముఖుడు, సీనియర్ వైద్యుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు సంఘటన స్థలానికి చేరుకొని సర్ది చెప్పడంతో చలమలశెట్టి రమేష్ బాబు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత చలమలశెట్టి రమేష్ బాబును, గరికిపాటి శివను పోలీసులు జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఇద్దరి నేతలకు హనుమాన్ జంక్షన్ సిఐ నవీన్ నరసింహమూర్తి కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి రెండు వైపుల వారిపై 107 సెక్షన్ కింద బైండోవర్ కేసు నమోదు చేశారు. జంక్షన్ ఎస్ఐ జనార్ధన్ తన సిబ్బందితో ఘర్షణను నిలువరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మొదటిపేజీ తరువాయి



స్వచ్ఛ సర్వేక్షన్‌లో విఎంసికి అవార్డు

నిర్ణయించిన ఆయా అంశాల ఆధారంగా మొత్తం 9500 మార్కులకుగాను విఎంసి 8751 సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు నగరాలకు జాతీయస్థాయిలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలు ర్యాంకులు సాధించాయన్నారు. టాప్ టెన్‌లో మూడు ర్యాంకులు రావడం హర్షనీయమన్నారు. ఏ రాష్ట్రానికీ ఘనత దక్కలేదన్నారు. విఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ ఘనతలో కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి ఉందన్నారు. ఈ అవార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, ఇదొక బాధ్యతని అన్నారు. విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ విజయవాడ రెండో పరిశుభ్రమైన నగరంగా పేరొందిందన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో ఫైవ్ స్టార్ రేటింగ్ దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కెవి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి పాల్గొన్నారు.

వైసిపిలో భారీ మార్పులు

టిడిపిలో చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మొత్తంగా చూసుకుంటే ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఇప్పటివరకు ప్రకటించిన ఐదు స్థానాల్లో ఇద్దరు సిట్టింగ్ ఎంఎల్ఎలు వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేష్‌లకు స్థానచలనం చేశారు. వెలంపల్లిని విజయవాడ సెంట్రల్‌కు, జోగి రమేష్‌ను పెనమలూరుకు నియమించారు. విజయవాడ పశ్చిమ ప్రాతినిధ్యం వహిస్తున్న వెలంపల్లి స్థానంలో ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న షేక్ ఆసిఫ్‌ను నియమించారు. ఇక మచిలీపట్నం ఇన్చార్జిగా సిట్టింగ్ ఎంఎల్ఎ పేర్ని వెంకట్రామయ్య (నాని) కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను నియమించారు. పెనమలూరు, విజయవాడ సెంట్రల్ ఎంఎల్ఎలు కె.పార్థసారథి, మల్లాది విష్ణులకు టికెట్లు నిరాకరించారు.

వైసిపిలోకి మాజీ ఎంఎల్ఎ నల్లగట్ల

అవకాశం ఉన్నట్లు తెలిసింది. గత పది రోజుల నుండి స్వామిదాసు వైసిపి నుండి బరిలోకి దిగనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది. స్వామిదాసు విజయవాడ ఎంపి కేశినేని నాని అనుచరుడిగా ఉన్నారు. ఈనేపథ్యంలో వైసిపికే చెందిన తిరువూరు సిట్టింగ్ ఎంఎల్ఎ కె.రక్షణనిధికి ఈసారి టికెట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. సీఎం కార్యాలయానికి రావాలని వైసిపి అధినేతలు రక్షణనిధికి అనేకసార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదని తెలిసింది. పెనమలూరు ఎంఎల్ఎ కె.పార్థసారథితో కలిసి టిడిపిలో చేరేందుకు రక్షణనిధి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

చిరువ్యాపారులకు 'జగనన్న తోడు'

రుణాలు అందించామన్నారు. ప్రస్తుతం 8వ విడతలో 13,710 మందికి రూ.14.50 కోట్లు అందిస్తున్నామన్నారు. అలాగే 27,913 మంది లబ్దిదారులకు రూ.67.95 లక్షలను వడ్డీ కింద బ్యాంకులకు తిరిగి చెల్లించినట్లు చెప్పారు. ఈసందర్భంగా లబ్దిదారులకు నమూనా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం, పామర్రు శాసనసభ్యులు పేర్ని వెంకటరామయ్య (నాని), కైలే అనిల్ కుమార్, కెడిసిసి బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమల పూర్ణమ్మ, ముడా చైర్మన్ బొర్రా వెంకట కనకదుర్గ నాగ లక్ష్మీ భవాని, నగర మేయరు చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిలావర్ నజరానా, డిఆర్‌డిఎ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, స్థానిక నాయకులు పేర్ని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిదో విడతలో 16,967 మంది లబ్దిదారులకు రూ.17.95 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించిన 18,397 మందికి రూ.51.29 లక్షల వడ్డీ రీయింబర్స్ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. 8వ విడత లబ్ధి కలుపుకుంటే జిల్లాలో ఇప్పటి వరకు 1,46,724 మంది లబ్ధిదారులకు రూ.149.39 కోట్ల రుణాలు అందినట్లు తెలిపారు. అలాగే 70,428 మందికి రూ.1.68 కోట్ల మేర వడ్డీ రీయింబర్స్ జరిగినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు మెగా చెక్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, భట్రాజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఎల్‌డిఎం కె.ప్రియాంక పాల్గొన్నారు.

నేడు 'మోడీ, షా హఠావో - దేశ్ బచావో' సభ

విజయరావు కోరారు. భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, దేశ సంపదను లూటీ చేసి అదానీ, అంబానీలకు కట్టబెడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపి, దాని మద్దతుదారులను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని వారు పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ ఉద్యమిస్తాం

• 31వ రోజుకు అంగన్వాడీల సమ్మె • వివిధ పార్టీల నాయకులు మద్దతు



మచిలీపట్నంలో..

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది.అలాగే 24 గంటల రిలే నిరాహారదీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడిన డిమాండ్స్ పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని పలువురు కార్యకర్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమ్మెలో సెక్టార్ అధ్యక్ష ,కార్యదర్శులు నాంచారమ్మ, పి.రెజీనా రాణి,సభ్యులు కే లక్ష్మి ,సుజాత, సౌజన్య, విటలేశ్వరి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని అంగన్వాడి కార్యకర్తల, ఆయాల ఇళ్లకు, అంగన్వాడి కేంద్రాలకు రెవెన్యూ అధికారులు గురువారం నోటీసులు అంటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుడివాడ ఐసిడిఎస్ సి డిపిఓ జారీ చేసిన నోటీసులు లో అంగన్వాడీ కార్యకర్తలకు ఇవ్వాల్సిన బకాయిలు అందించామని, వారి కోరిన డిమాండ్లు కొన్ని అమలుపరిచామని, అంగన్వాడి భవనాల మరమ్మత్తులు, నిర్వహణకు కావలసిన అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీలు నెలరోజులుగా చేస్తున్న ధర్నా కారణంగా చిన్నారులు, బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం అందకపోవటం వల్ల వారు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈనెల 5వ తేదీ అంగన్వాడీలను విధుల్లోకి హాజరుకావాలని ప్రభుత్వం కోరినా వారు నిరాకరించడంతో ఈ నోటీసులు జారీ చేస్తున్నామని దీనిపై అంగన్వాడీ కార్యకర్తలు వివరణ తెలపాలని నోటీసులో పేర్కొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కంకిపాడు మండల అధ్యక్షులు సూది మల్ల రవీంద్ర, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి పీత గోపీచంద్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బొప్పన నీరజ, తెలుగుదేశం పార్టీ కంకిపాడు మండల మాజీ ఎంపీపీ దేవినేని రాజా అంగన్వాడి డ్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, కష్ణాజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పొదిల లలిత, టిడిపి పెనమలూరు మండల అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్, ఉప్పాడ త్రిమూర్తులు, రాజేష్ అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం కంకిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు నళిని కుమారి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు ఎం రేవతి, సెక్టార్ లీడర్ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం, కాళిమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి ఆదిశేషు, ధోనే సహదేవుడు, కొప్పనాతి తాతయ్య పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లిలో నిర్వహిస్తున్న సమ్మెకు పెడన తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కష్ణ ప్రసాద్ మద్దతు తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఉరిని సర్పంచి మంచికర్ల రమేష్ నిరాహార దీక్ష చేసి మద్దతు తెలియజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ నిలపర్స్ యూనియన్ నాయకులు నిమ్మరసం ఇచ్చే విరవింఎ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో అంగన్ ఒవాడీలు ఒంటి కాళ్ళ నిలబడి నిరసన తెలియజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు చొప్ప బాజీ, రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసుల అజయ్‌ఘోష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరంలో అంగన్వాడీలు ధర్నా కొనసాగుతోంది. సమ్మెకు సిఐటి యు నాయకులు మద్దతు తెలిపారు. **పామర్రు:** పామర్రులో అంగన్‌వాడీ దీక్షను సిఐటియు నాయకులు ఓ గంగాధర్ ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు కుమార్ రాజా, జనసేన నాయకులు సనకా కిరణ్. చాట్ల రమేష్. దాలిపర్తి ప్రసాద్, మంతెన సీతారాములు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. రత్నశ్రీ పద్మజ జ్యోతి వాణి రాజేశ్వరి చిన్నారి పాల్గొన్నారు.



అవనిగడ్డలో...



బంటుమిల్లిలో...



గన్నవరంలో...



కంకిపాడులో...



పామర్రులో...

రేమల్లెలో 'బాబు ష్యూరిటీ'



వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : అవినీతి అనకొండ సీఎం జగన్ అని, పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో లక్షల కోట్లు దోచుకొని పేదలను మాత్రం అప్పుల పాలు జేశారని గన్నవరం ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం రేమల్లె గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సీక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించగలిగే సత్తా టీడీపీతోనే సాధ్యమని తెలిపారు.గత టీడీపీ హయాంలో జరిగిన అభివద్ధి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ హయాంలో ఏమైనా అభివద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి సీఎం జగన్ మోహన్ రెడ్డి వరకు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి స్వలాభం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, కార్యదర్శి గుడివాడ విజయానంద్, యనమదల సుధాకర్, కలపాల కుమార్, దొంతు చిన్నా, వేమ లపల్లి శ్రీనివాసరావు, యనమదల వెంకయ్యారావు, ఆళ్ల గోపాలకష్ణ, మూల్పూరి సాయికళ్యాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగవరప్పాడు గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ళ వెంకటకష్ణారెడ్డి నాయకత్వాన కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు మావులూరు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో ప్రారంభమైన మండల స్థాయి ఆడుదాం క్రీడలు రెండవ రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. యంపిపి అనగాని రవి, ఎం. పి. డి ఓ సత్యకుమార్ పర్యవేక్షణలో గన్నవరం మండల క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు పోటీలను నిర్వహించారు. కబడ్డీ పురుషుల విభాగం లో :అజ్జంపూడి జట్టు అల్లాపురం పై గెలిచింది. సూరంపల్లి జట్టు కొత్తగూడెం పై బుద్దవరం జట్టు కేసరపల్లి పై పురుషోత్తపట్నం ముస్తాబాద పై గెలిచాయి. సావారిగూడెం గన్నవరంపై, తెంపల్లి మాద లవారిగూడెం జట్టు పై గెలిచింది. కేసరపల్లి జట్టు గన్నవరంపై, బుద్దవరం గొల్లనపల్లిపై, వీరపనేనిగూడెం చిక్కవరంపై, ముస్తాబాద గన్నవరం పై సూరంపల్లి జట్లు గెలుపొందాయి. మహిళల విభాగంలో గన్నవరం జట్టు సూరంపల్లిపై గెలిచింది. అలాగే బుద్దవరంపై చిక్కవరం గెలిచింది. సూరంపల్లి పురుషోత్తపట్నంపై గెలిచింది. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలం గుండుపాలెం పంచాయతీ లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలు హెూరాహెూరీగా జరుగు తున్నాయి. గురువారం జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో చిన్నాపురం -1 జట్టు తాళ్లపాలెం -1 సచివాలయం జట్టు పై విజయం సాధించి విజేతగా నిలిచి నియోజకవర్గం స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. అనంతరం నిర్వహించిన వాలీబాల్ పోటీలు సైతం అధ్యంతం హెూరాహెూరీగా జరిగాయి. నాకౌట్ విధానంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన తాళ్లపాలెం -1, తాళ్లపాలెం -2 సచివాలయం జట్లు ఫైనల్ లోకి ప్రవేశించ్చాయి. హెూరహెూరీగా జరిగిన ఫైనల్ పోటీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన తాళ్లపాలెం -2 సచివాలయం జట్టు తాళ్లపాలెం -1 సచివాలయం జట్టు పై 30-26 స్కోరు తేడాతో అద్భుత విజయం సాధించింది. వాలీబాల్ విజేతగా నిలిచిన తాళ్లపాలెం -2 సచివాలయం జట్టుకు అరిసేపల్లి పంచాయతీ కార్యదర్శి సుకుమార్ రూ. 1116 బహుకరించి చక్కని ఆట తీరు ప్రదర్శించిన ఇరు జట్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. **పజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలములోని వడ్లమన్నాడు గ్రామము లోని జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో ఆడుదాం ఆంద్రా మండల స్థాయి పోటిలలో భాగంగా కబడ్డీ పోటీలు 10,11వ తేదిలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసీ సభ్యులు ఎం .దిలీప్ కుమార్ ,సర్పంచ్ కటికల జ్యోతి ,కొండాలమ్మ గుడి చైర్మన్ శేషం గోపి, వ్యవసాయ మండలి చైర్మన్ పెన్నేరు ప్రభాకర రావు ,మండల పరిషత్ అభివద్ధి అధికారి దారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచేందుకు నూతన వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరొక కీలక అడుగు ముందుకు వేసిందని జిల్లా కలెక్టర్ పి.రాజబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ వెబ్సైట్ పోర్టల్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు తగ్గట్లు వెబ్ సైట్ ప్రారంభించడం యువతకు ఎంతో ఉపయోగ పడుతుందని వెల్లడించారు. ఉద్యోగం అనివార్యమనుకునే యువత ఎక్కడెక్కడో శోధించాల్సిన పని లేకుండా సమస్త సమాచారం, సమగ్ర రంగాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్ పోర్టల్ ద్వారా యువతకు మరింత చేరువ చేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పదో తరగతి దగ్గర నుంచి డిగ్రీ, డిప్లమో ఏది చేసినా సరే employment.ap.gov.in పోర్టల్ లో నమోదు చేసుకుంటే పూర్తి సమాచారాన్ని బట్టి ఆయా రంగాలలో గల ఉపాధి అవకాశాలు వెంటనే తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు రాజబాబు తెలిపారు. ఎంప్లాయ్ మెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనల తో యువత భవితకు భరోసా కల్పించే ఉద్దేశంతో నూతన వెబ్సైట్ పోర్టల్ కు శ్రీకారం చుట్టిందన్నారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులు సహా ఐ.టీ, టెక్నికల్ రంగాలపై యువత ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో 'ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజ్' ను వారి అవసరాలకు పెద్దపీట వేస్తూ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి అధికారి జీ.వెంకటేశ్వర రావు(ఒకేషనల్ గైడెన్స్), యంగ్ ప్రొఫెషన్ ఎస్.జయరాజు తదితరాలు పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



గుడివాడలో...

ప్రజాశక్తి - గుడివాడ : వికాస్ రెయిన్బో స్కూల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం సాంప్రదాయక ఆటల పోటీలు నిర్వహించారు. వికాస్ రెయిన్బో స్కూల్లో విద్యార్థులు రంగు రంగుల రంగవల్లులు, సంక్రాంతి పాటలు పాడి, భోగిమంటలు, గంగిరెద్దుల సన్నాయి వాయిద్యాలు, ముత్యాల ముగ్గులు, గుమ్మడిపూలు గొబ్బిళ్ళు చిన్నారుల ఆనందోత్సాహాలు చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణల మధ్య పాఠశాలలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి రామచంద్ర శేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు

తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో గురువారం ధూళిపాల శేషగిరి తల్లి కొడాలి విజయ్ భారతి స్మారకార్థం షా గులాబ్ చంద్ ప్రధమ శ్రేణి శాఖ గ్రంధాలయంలో రంగవల్లులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంస్కతి సంప్రదాయ పరిరక్షణకు తెలుగు భాషా వికాస సమితి చేస్తున్న కషి అభినందనీయమన్నారు. అనంతరం రంగవల్లుల పోటీలలో విజేతకు బహుమతులు అందజేశారు. తాడిపర్తి సునీత, కుమారి పూర్ణిమ, సంధ్య, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, డి ఆర్ బి ప్రసాద్, కొడాలి రామ్మోహన్రావు, గాదె మోహన్ బాబు, భవిత, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలోని ఎస్వీఎల్ క్రాంతి కళాశాలల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు రంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకోలు నరసింహారావు లు ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుజాతి గొప్పగా నిర్వహించుకునే సంప్రదాయ పండుగ సంక్రాంతి అని పేద ధనిక తేడా లేకుండా అందరూ ఈ వేడుకలను జరుపుకుంటారన్నారు.కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో కోడి పందాలు పొట్టేళ్ల పందాలు గంగిరెద్దుల విన్యాసాలు భోగి మంటలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థుల మధ్య ఆనందాలను పాల్పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహవ రితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్త పరుచూరి దుర్గాప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఏ

ఉపాధి అవకాశాల పెంపునకు వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరొక ముందడుగు వేసింది అని జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్సైట్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక సంస్థల్లో ఉపాధి అవకాశాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకునే విధంగా ఈ వెబ్సైట్ ను రూపొందించారు అని తెలిపారు.ఈ వెబ్సైట్ ద్వారా అనేక ప్రాంతాలలో ఖాళీగా ఉండే ఉద్యోగ వివరాలను పొందుపరచబడి ఉంటుంది తద్వారా నిరుద్యోగ యువతకు వారి అర్హతను బట్టి తమకి కావాల్సిన ఉద్యోగాలకు దరఖాస్తు సులభతరం అవుతుంది అని పేర్కొన్నారు.కాలానుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు నూతన వెబ్సైట్ ను రూపొందించి అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనల తో యువత భవితకు భరోసా కల్పించే ఉద్దేశంతో నూతన వెబ్సైట్ పోర్టల్‌కు శ్రీకారం చుట్టింది



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జెసి సంపత్‌కుమార్

అన్నారు.గతంలో స్థానిక ఉపాధి కల్పన కార్యాలయాల్లో నిరుద్యోగ యువత వివరాల నమోదు జరిగేది అని తద్వారా సీనియారిటీ ప్రకారం ఉద్యోగాల భర్తీ పూర్తి చేసేవారు అని పేర్కొన్నారు.ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్సైట్ పోర్టల్ లో ఆధార్ ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అయి తమ విద్యార్హత ల వివరాలను నమోదు చేయగానే మొబైల్ లో సందేశం వస్తుంది అని వేనువెంటనే ఆ వివరాలు అయా జిల్లా స్థాయి అధికారికి చేరి వారి ఆమోదం తో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ తెలుస్తాయన్నారు.జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ మరియు అదనపు అర్హతల నమోదు తదితర సేవలు employment.ap.gov.in వెబ్‌పోర్టల్‌లో ద్వారా అందుబాటులోకి ఉన్నారు అని తెలిపారు.అదే విధంగా స్థానిక ఇంటర్నెట్ సెంటర్ లో,జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం/మోడల్ కేరీర్ సెంటర్లో మరియు మొబైల్ ఫోన్ల ద్వారా కూడా అభ్యర్థి తాను ఉన్నచోట నుండే ఈ సేవలను వినియోగించుకోవచ్చు అని తెలిపారు.అభ్యర్థి లాగిన్ ద్వారా ఎంప్లాయిమెంట్ కార్డ్ ను డౌన్లోడ్ మరియు రెన్వల్ కూడా చేసుకోవచ్చు అని తెలిపారు.అంతేకాక అభ్యర్థులు వెబ్సైట్ లో లాగిన్ అయి తమ పాత ఎంప్లాయిమెంట్ కార్డ్ నెంబర్ సరిచూసుకుని కొత్త కార్డును పొందవచ్చు అని అన్నారు.ఈ వెబ్సైట్ లో అభ్యర్థులు పదవ తరగతి దగ్గర నుండి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర ఇతర కోర్సులు పూర్తి చేసినప్పటికీ ఈ పోర్టల్ లో నమోదు చేసుకోవడం ద్వారా అందుబాటులో ఉద్యోగ వివరాలతో పాటు పైన తెలిపిన సేవలను కూడా పొందవచ్చు అని విక్టర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి అధికారి వై.సత్య బ్రహ్మం (ఒకేషనల్ గైడెన్స్), యంగ్ ప్రొఫెషన్ ఎస్.జయరాజు తదితరాలు పాల్గొన్నారు.



కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్‌బాల్ విజేత కెబిఎన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల మహిళా హ్యాండ్ బాల్ పోటీలు డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైలవరంలో జరిగిన ఈ పోటీలలో తమ కళాశాల ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఛాంపియన్షిప్ సాధించిందని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ కష్ణ యూనివర్సిటీ తరపున సేలం తమిళనాడులో పెరియార్ యూనివర్సిటీ నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్ బాల్ పోటీలకు తమ కళాశాల నుండి ఏడుగురు విద్యార్థినిలు ఎంపిక కావడం ఎంతో గర్వకారణం వీరంతా ప్రధాన జట్టులో ఉండడం కళాశాలకు మరింత పేరు తెచ్చిన వారైనారు ఈ ఆట కళాశాల మాత ఆటగా గుర్తింపు లభించింది ఎంపికైన వారిలో ఏ. రాగ మౌనిక, పి. శివాని, జి. లలితా శ్రీ, జీ. మానస, ఎస్. వెంకటేశ్వరమ్మ, బి.జెస్సి, బి. లోకేశ్వరి ఉన్నారు విజేతలను మరియు వీరిని తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి శ్రీనివాస్ మరియు వైస్ ప్రిన్సిపాల్ పి ఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు తదితర అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: ప్రేక్షకుల కోసం ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలను అందిస్తున్న జీ తెలుగు ఛానల్ ఈనెల 14, 15 తేదీలలో సంక్రాంతి సంబరాలు పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రసారమవుతుందని ఛానల్ ప్రతినిధి ఎం.ఎస్.రాజు ఒక ప్రక టనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రసారంకానుందని తెలిపారు. వివిధ వినోద కార్యక్రమాలతో పాటు డ్యాన్సులు, సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయన్నారు. వివిధ రకాలైన పోటీలను కూడా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

క్రికెట్ బ్యాట్ బహూకరణ

ప్రజాశక్తి-భవానీపురం: మన ఊరు మన అట కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ సూచనలతో 42వ డివిజన్లో సంక్రాంతి పండుగ సందర్భంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న వారికి 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష బ్యాట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు గాకుండా క్రీడారంగంలో పాల్గొనాలని కోరారు. క్రీడలు మానసికోల్లాసానికి, ఆరోగ్యవంతంగా ఉండటానికి ఎంతో దోహదపడతాయని ఆమె తెలిపారు.



లోకేష్‌ను కలిసిన పశ్చిమ టిడిపి నాయకులు



ప్రజాశక్తి-వన్‌టౌన్: తెలుగుదేశంలోనే తాము కొనసాగుతామని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు టిడిపి పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ తెలిపారు. గురువారం టిడిపి పశ్చిమ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు,క్లస్టర్ ఇంచార్జ్‌లు అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, తన అనుచరులతో కలిసి ఉండవల్లిలో నారా లోకేష్‌ని కలిసిన ఎం.ఎస్ బేగ్ తామంతా తెలుగుదేశంలోనే వుంటామని స్పష్టం చేశారు. ఇటీవల పలుమార్లు ఎంఎస్ బేగ్‌ను విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యేని చేస్తానంటూ విజయవాడ ఎంపీ కేశినేని నాని ప్రకటించారు. అయితే శరవేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేశినేని నాని తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. దీంతో ఎంపీ కేశినేని వెంట ఎంతమంది తెలుగుదేశం నాయకులు వెళ్లిపోతారోనన్న చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కేశినేని నాని వెంటే వెళ్లేది లేదని బేగ్ ప్రకటించారు. ప్రస్తుతం పశ్చిమ టిడిపి టిక్కెట్‌ను ఎంఎస్.బేగ్ బలంగా ఆశిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గంలో ఇంటింటికీ తిరుగుతున్నారు. ఏదేమైనా పశ్చిమ టిడిపి రాజకీయాలు మంచి రసకందాయంలో పడ్డాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

విద్యార్థులకు లీడ్ సంస్థ పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులు చక్కగా రాణించడంతో పాటు స్కిల్స్ కూడా పెంపొందించుకుంటున్నారని సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.పాపారావు తెలిపారు. నగరంలోని లీడ్ ఎడ్‌టెక్ సంస్థ కార్యాలయంలో గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీడ్ సంస్థ లీడ్ ఛాంపియన్‌షిప్ పేరుతో రాష్ట్రంలోని ప్రముఖ ప్రాంతాలలో విద్యార్థులకు అవగాహనతో పాటు వివిధ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్, క్రిటికల్ థింకింగ్, వంటి అంశాలలో చక్కని నైపుణ్యం ప్రదర్శించారని అన్నారు. అలాగే లీడ్ కరిక్యులమ్‌ను ఎవరైనా పాఠశాలల కోరితే వారికి అందించే విధంగా సంస్థ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. లీడ్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు చక్కని స్కిల్స్ పెంపొందించుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందచేశారు.



వైసిపి ఓటమి ఖాయం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏడుకొండలు

ప్రజాశక్తి-వన్‌టౌన్

వైసీపీలో బీసీ నేతలకు ప్రజలకు గౌరవం లేదని, రానున్న ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓటమి చెందటం ఖాయమని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు ఘాటుగా విమర్శించారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల ముందు వైసీపీ బీసీ నేతలు బానిసలుగా తలవంచుకునీ బతుకుతున్నారని అన్నారు. త్వరలోనే బీసీ ఎంపీ డాక్టర్ సంజీవ్ లాగా కొద్ది రోజుల్లో పలువురు బీసీ నేతలు వైసిపికి గుడ్ బై చెప్పనున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలనలో జనాభాలో 60 శాతం ఉన్న బీసీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, జగన్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీసీ యువతకు సరైన విద్యా ప్రోత్సాహకాలు అందడం లేదని, కొత్త పరిశ్రమలు రావడం లేదని, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు అన్నింటిని జగన్ రెడ్డి చిన్నాభిన్నం చేసేసారని, వైసీపీ అరాచకత్వానికి హద్దు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీలో బీసీలకు రాజకీయ భవిష్యత్తు లేదని, పార్టీ మొత్తం ఒకే సామాజిక వర్గం అధీనంలో ఉందని ఏడుకొండలు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని, తెలుగుదేశం లోనే బీసీలకు తగిన గౌరవం ఉందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు గణపా రాము, రాజగిరి అశోక్, బి. సత్తిబాబు, జి.సుధాకర్ పాల్గొన్నారు.

షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కానూరులోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం పాఠశాల ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ల్యాండ్ రికార్డ్స్ అండ్ సెటిల్‌మెంట్ సర్వే కమీషనర్ సిద్దార్ధ జైన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జనరల్ విశాల్ గున్ని పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంపొందించుకోవాలని కోరారు. విజయవాడ నగరంలోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అన్ని రకాలైన వసతులు ఉన్నాయని మంచి పాఠశాల వాతావరణం విద్యార్థులకు అనువైన విధంగా ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో విశాఖపట్నంలోని మెరిలిన్ షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్స్ మేనేజింగ్ పార్టనర్ హరిచరణ్ ఎన్, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భారతీధర్, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ పాల్గొన్నారు.

